అనుమతిలేకుండా..

● డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే రహదారులపైకి
● 30 శాతం కుర్రకారుది ఇదే తీరు
● ఆటోవాలాల్లో 40 శాతం మంది
● అధికారుల తనిఖీల్లో వెల్లడి



కర్నూలు: అతివేగంగా బైకులపై దూసుకెళ్లే యువకులు... పాదచారులపై దూసుకొచ్చే కార్లు... ఎర్ర లైటు పడినా లెక్క చేయకుండా వెళ్లే ఆటోవాలాలు... కర్నూలు నగరంలోని రహదారులపై ఇవి నిత్యం కనిపించే దృశ్యాలే. అయితే, ఇలా వాహనాలు నడిపేవారిలో చాలా మందికి డ్రైవింగ్ లైసెన్స్ లేవనే చేదునిజం పోలీసులు గత కొద్దిరోజులు నిర్వహిస్తున్న ప్రత్యేక తనిఖీల్లో వెలుగుచూసింది.

అర్ధరాత్రి దాటాక షికార్లు...

కర్నూలు నగరంలో వాహనాలు నడుపుతున్న యువకులు, విద్యార్థుల్లో 30 శాతం మందికి పైగా డ్రైవింగ్ లైసెన్స్ లేదు. తల్లిదండ్రుల వాహనాలు, స్నేహితుల స్పోర్ట్స్ బైక్‌లను వీరు బయటకు తీసుకువచ్చి రహదారులపై దూసుకెళ్తున్నారు. పాదచారులు, ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. వారాంతాల్లో అర్ధరాత్రి వేళ నగర శివారులోని రింగ్ రోడ్డుపై (జగన్నాథ గట్టు) రేసులు నిర్వహిస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారికి గతంలో ఫిర్యాదులు కూడా అందాయి. పోలీసులు గట్టిగా నిఘా ఉంచడంతో ఆ జోరు తగ్గినప్పటికీ లైసెన్స్ లేకుండా వాహనాలు తోలుతున్న వారి సంఖ్య తగ్గడం లేదు.

ఆరు మాసాల వ్యవధిలో 3,600 మందిపై కేసులు...

నిబంధనల ఉల్లంఘనులపై ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధిస్తున్నప్పటికీ వాహనదారుల్లో మార్పు కనిపించడం లేదు. ఒక్క కర్నూలు నగరంలోనే ఆరు మాసాల వ్యవధిలో 3,600 మంది యువకులు, 350 మంది మైనర్లు లైసెన్స్ లేకుండా పోలీసులకు పట్టుబడ్డారంటే వాటి తీవ్రతకు అద్దం పడుతోంది. పట్టుబడిన మైనర్లలో మార్పు తీసుకొచ్చేందుకు పోలీసులు వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

నడపటానికి అర్హత లేదు...

ఆటోలు నడుపుతున్న వారిలో ప్రతి పదిమందిలో నలుగురికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండటం లేదని తనిఖీల్లో పోలీసులు గుర్తించారు. ఆర్థిక ఇబ్బందులు, పేదరికం కారణంగా ఇల్లు గడిచేందుకు వేరే ఆధారంగా లేక కొందరు డ్రైవింగ్‌ను వృత్తిగా ఎంచుకుంటున్నారు. రవాణా శాఖ నిబంధనల మేరకు ట్రాన్స్‌పోర్ట్ లైసెన్స్ ఉండాలి. దీనినే డ్రైవర్ల పరిభాషలో 'బ్యాడ్జి'గా వ్యవహరిస్తారు. ఇందుకు కనీసం 8వ తరగతి చదివి ఉండాలి. 5వ తరగతితో ఆపేయడం, మరికొందరు నిరక్షరాసులవడంతో లైసెన్స్‌లు తీసుకోవడం లేదు. ఇలాంటి వారిలో చాలా మంది రాత్రివేళల్లో ఆటోలు నడుపుతున్నారు. పోలీసులు తనిఖీ చేసినప్పుడు లైసెన్స్ ఇంట్లో మరిచిపోయామని, అవసరమైతే జరిమానా కడతామని చెబుతున్నారు. బ్యాడ్జి లేకున్నా సాధారణ లైసెన్స్ తీసుకోవాలనే నిబంధనలు ఉన్నప్పటికీ తీసుకునే ప్రయత్నం చేయడం లేదు. లైసెన్స్ లేని వారిలో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి నగరంలో అద్దె ఆటోలు నడుపుతున్నట్లు తనిఖీల్లో గుర్తించామని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. అయితే ఆటోడ్రైవర్లలో అర్హులైన వారికి చదువుకోలేని వారిని గుర్తించి సాధారణ లైసెన్స్ ఇప్పించేందుకు పోలీసు, రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆటో యూనియన్ల ప్రతినిధులు కొన్నేళ్లుగా కోరుతున్నారు. అనుకోకుండా ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు ఇన్సూరెన్స్ సొమ్ము వచ్చేలా అధికారులు నిర్ణయం తీసుకోవాలని యూనియన్ల ప్రతినిధులు కోరుతున్నారు.


డ్రైవింగ్ లైసెన్ తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసు

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపటం నేరం



లైసెన్స్ లేకుండా వాహనాలు నడపటం చట్టరీత్యా నేరం. ట్రాఫిక్ నిబంధనలపై కళాశాలల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి అనుకోకుండా ప్రమాదానికి గురైతే విద్యార్థులు కేసుల్లో ఇరుక్కుని ఉద్యోగార్హత కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాం. కొంతమంది ఇన్సూరెన్స్ లేని వాహనాలు కూడా నడుపుతున్నారు. ఇది మరింత ప్రమాదకరం.

– నాగభూషణం, ట్రాఫిక్ డీఎస్పీ

నేటి సమాచారం

కురువల సమావేశం

కర్నూలు సిటీ: రాబోయే ఎన్నికల్లో రాజకీయ భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు నేడు (ఆదివారం)ఎస్వీ కాంప్లెక్స్‌లోని మీటింగ్ హాలులో సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కురువ సంఘం ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కురువ కుల సంఘ ప్రముఖులు, నాయకులు పెద్ద ఎత్తున తరలిరానున్నారన్నారు. సమావేశంలో ప్రధానంగా రాష్ట్రం, జిల్లాలో కురువల రాజకీయ భవిష్యత్తు, మదాసి, మదారి కురువ కుల ధ్రువీకరణ పత్రాలపై చర్చిస్తామన్నారు.

ఏపీఆర్ఎస్ఏ సమావేశం

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సమావేశం ఆదివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గిరికుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఆర్ఎస్ఏకు సంబంధించిన కలెక్టరేట్ యూనిట్ బాడీని ఎన్నుకోనున్నట్లు చెప్పారు. ఇప్పటికే వెంకటరాజు నేతృత్వంలో ప్యానెల్ పోటీలో ఉందని, వారికి ఎవరైనా పోటీగా వస్తే ఎన్నికలు నిర్వహించి ప్రజాస్వామ్యబద్ధంగా కమిటీని ప్రకటిస్తామన్నారు.

పనిచేయనున్న బిల్లుల కౌంటర్లు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లుల కౌంటర్లు ఆదివారం కూడా పనిచేస్తాయని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజు అయినా వినియోగదారుల సౌకర్యార్థం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఉన్న కౌంటర్లను తెరిచే ఉంచనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు బిల్లులు చెల్లించని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, సకాలంలో బిల్లులు చెల్లించాలని సూచించారు.

క్లుప్తంగా

డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డికి సన్మానం


మాట్లాడుతున్న డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్) : పదవీ విరమణ చేయనున్న ప్రభుత్వ కంటి ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డిని శనివారం వైద్యులు ఘనంగా సన్మానించారు. కంటి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో హెచ్ఓడీ డాక్టర్ రేవతి మాట్లాడుతూ సుదీర్ఘ కాలం ఆసుపత్రిలో కంటి వైద్యుడిగా, సూపరింటెండెంట్‌గా అందించిన సేవలను కొనియాడారు. కంటి ఆసుపత్రి అభివృద్ధిలో, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో ఆయన కృషి ఎనలేనిదన్నారు. డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ సుదీర్ఘకాలం ఆసుపత్రిలో విజయవంతంగా పనిచేయడంలో సహచర వైద్యుల పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ హరిచరణ్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, కంటి వైద్యులు పృథ్వీ వెంకటేశ్వర్లు, యుగంధర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ చేయాలి

కర్నూలు(రూరల్): రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జగన్నాథం డిమాండ్ చేశారు. శనివారం సీఆర్ భవనంలో రైతుల ధర్నా కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ.... గత సంవత్సరం పంటలు సరిగ్గా పండక రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత సర్కారుపై ఉందన్నారు. ఈ అంశాలపై ఆగస్టు 7న విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి రైతులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణ రెడ్డి, సహాయ కార్యదర్శులు మహేష్, దంభోళం, రామాంజనేయులు,బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆవును రక్షించిన అగ్నిమాపక సిబ్బంది

కర్నూలు(రూరల్): నగరంలోని శ్రీనివాస నగర్ పరిధిలో ఉన్న బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వెనుక శనివారం ప్రమాదవశత్తు గుంతలో పడిన ఆవును అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. గుంతలో పడిన ఆవు అరుపులను విన్న స్థానికులు వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించారు. జిల్లా ఉప అగ్నిమాపకాధికారి చిన్న బజారి తన సిబ్బందితో అక్కడి చేరుకుని రోప్, జేసీబీ సహాయంతో ఆవును గుంతల నుంచి బయటకు తీశారు.

ప్రహరీని కూల్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్) : కేసీ కెనాల్‌పై ఉన్న కాళీ మాత దేవాలయ ప్రహరీని కూల్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరీష్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రహరీ కూల్చివేత సమయంలో దేవతామూర్తుల విగ్రహాలను చిందర వందర చేశారన్నారు. వెంటనే కూల్చిన ప్రహరీని నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు.

ప్రాజెక్టులు నిర్మించాలి



మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

కర్నూలు (రూరల్) : జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని సుందరయ్య భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఆగస్టు 2వ తేదీన ఆదోని నుంచి మహా పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా విభజన తర్వాత కర్నూలు ఎడారిగా మారే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి గుండ్రేవుల, ఆర్డీఎస్ కుడి కాలువ, వేదావతిని వెంటనే పూర్తి చేయాలన్నారు. హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి జిల్లాలోని చెరువులను నీటితో నింపాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో 50 పడకలతో ఆసుపత్రులు నిర్మించాలన్నారు. పత్తికొండలో టమాట జ్యూస్, సాస్ ఫ్యాక్టరీ నిర్మించాలన్నారు. ఈ అంశాలపై ఆగస్టు 7వ తేదీవ కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాకు పొలిట్ బ్యూరో సభ్యులు రాఘవులు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నారాయణ, రాధాకృష్ణ, నాయకులు హుస్సేన్ బాషా పాల్గొన్నారు.

మతోన్మాద దాడులపై పోరాడుదాం

కర్నూలు(రూరల్): మణిపూర్‌లో జరుగుతున్న మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య వాదులు ఏకమై పోరాడుదామని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అరుణమ్మ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని పెద్ద మార్కెట్ ఉర్దూగర్ ఫంక్షన్ హాల్‌లో కేవీపీఎస్, ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో మణిపూర్ పరిణామాలపై చర్చ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణమ్మ మాట్లాడుతూ.... మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు ఓ పథకం ప్రకారం జరుగుతున్నాయన్నారు. ఈ ఘటనకు ప్రధాన మంత్రి పూర్తి బాధ్యత వహిస్తూ పార్లమెంట్ సాక్షిగా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా ఈ నెల 31వ తేదీన జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు మహా ప్రదర్శన నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్ బాబు, ప్రముఖ ఆర్థికవేత్త మన్సూర్ రెహమాన్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడె కైలాస్ నాయక్,న్యాయవాది జయరాజు, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, కొమ్ము పాలెం శ్రీనివాసులు, చంద్రప్ప, సుభాన్, రోషన్ అలీ, తేజుమతి ı పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

మణిపూర్ ఘటనను ఖండించాలి

మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలను ప్రతి ఒక్కరూ ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ అన్నారు. శనివారం ఆ పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా పూల బజార్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మణిపూర్‌లో అల్లర్లను నివారించాలి

కర్నూలు(సెంట్రల్) : మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శాంతిని కోరుతూ శనివారం రాత్రి కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట ఆ యూనియన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, వెంకటేష్, రామకృష్ణారెడ్డి, జయరాం రెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత భవన నిర్మాణాల వేగం పెంచండి

● పీఆర్ ఈఎన్‌సీ బాలునాయక్

కర్నూలు(అర్బన్): జిల్లాలో చేపట్టిన ప్రాధాన్యత భవన నిర్మాణాల వేగం పెంచి నిర్ణీత సమయం లోగా వాటిని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని పీఆర్ ఇంజినీరు ఇన్ చీఫ్ బాలునాయక్ కోరారు. శనివారం ఆయన విజయవాడ నుంచి జిల్లా అధికారులతో వెబెక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ భవన నిర్మాణాలను పూర్తి చేసేందుకు వీలుగా అంచనా వ్యయాన్ని పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుందన్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలో జరుగుతున్న భవన నిర్మాణాలకు ఎంత మొత్తం అవసరమవుతుందనే విషయంపై వాకబు చేశారు. ఈ సందర్భంగా పీఆర్ ఎస్ఈ కె. సుబ్రమణ్యం మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న 357 గ్రామ సచివాలయాలకు సంబంధించి ఒక్కో సచివాలయ భవనానికి రూ.3.60 లక్షల ప్రకారం రూ.12.85 కోట్లు, 253 రైతు భరోసా కేంద్ర భవనాలకు గాను ఒక్కో భవనానికి రూ.2.14 లక్షల ప్రకారం 5.41 కోట్లు అదనంగా అవసరమవుతాయని చెప్పారు. అలాగే ఒక్కో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనానికి రూ.3.30 లక్షల ప్రకారం 354 భవన నిర్మాణాలకు అదనంగా రూ.11.68 కోట్లు విడుదలైనట్లు తెలిపారు. వెబెక్స్‌లో కర్నూలు ఈఈ ఈసీహెచ్ మద్దన్న, పీఏ టు ఎస్ఈ బీ శ్రీనివాసులు పాల్గొన్నారు.


వెబెక్స్‌లో మాట్లాడుతున్న పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం

మార్కెట్ మాయజాలం

● రైతు బజార్లలో కనిపించని టమాట
● బోర్డుపై మాత్రం ధర
● అసంతృప్తిలో వినియోగదారులు

కర్నూలు(అగ్రికల్చర్): టమాట ధరలు వినియోగదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మార్కెట్‌లో భారీగా ధరలు పెంచి వ్యాపారులు విక్రయిస్తున్నారు. వాటిని కొనుగోలు చేయడం సామాన్యులకు భారంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మదనపల్లి నుంచి టమాటలు తీసుకొచ్చి వారికి సబ్సిడీపై రూ. 50 కే విక్రయిస్తుంది. అయితే, కొద్ది రోజులుగా కురుస్తున్న వానలకు టమాట పంపిణీ తాత్కాలికంగా నిలిచిపోయింది. సరసమైన ధరకు లభించే రైతు బజార్‌కు వినియోగదారులు వస్తే వారికి టమాట కనిపించడం లేదు. బోర్డుపై ధర రాసి పెట్టిన అధికారులు వాటి విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోలేదు. మరోవైపు ఈ కొరతను ఆసరా చేసుకుని మార్కెట్‌లో కిలో టమాట రూ.120 నుంచి రూ.180 వరకు విక్రయిస్తున్నారు. కర్నూలులో మూడు రైతుబజార్లు ఉన్నాయి. వీటిల్లో కిలో టమాట ధర ఈ నెల 27న రూ.104, 28న రూ.100, 29న రూ.110 ఉన్నట్లు బోర్డుపై రాశారు. బయట ధరలు మరీ ఎక్కువగా ఉన్నాయి. రైతుబజారులో కాస్త ధర తక్కువగా ఉంటుందని వెళితే కనిపించని పరిస్థితి నెలకొంది. కర్నూలులో సి.క్యాంపు రైతుబజారు ప్రధానమైంది. ఇక్కడ ప్రతి రోజు బోర్డుపై ధర రాస్తున్నారు... కాని టమాట లభించకపోవడంతో వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. లేనపుడు బోర్డుపై ధర ఎందుకు రాయాలని కొందరు వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. రైతుల దగ్గర టమాటతో సహా ఇతర కూరగాయలు లేనప్పుడు పొదువు మహిళలు మార్కెట్ యార్డులో హోల్‌సేల్‌గా కొనుగోలు చేసుకొని రైతు బజారులో అమ్ముకోవచ్చు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆగస్టు 1న మార్కెటింగ్ శాఖ సబ్సిడీపై టమాట పంపిణీ చేసే అవకాశం ఉంది.


సీ.క్యాంపు రైతుబజారులో కనిపించని టమాట

సంక్షిప్త సమాచారం

రేపు న్యాయవాదుల నిరసన

కర్నూలు(లీగల్) : బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది ఆర్.ఆదిశేషు విట్టల్ దారుణ హత్య ఘటనకు నిరసనగా ఈనెల 31 సోమవారం జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు తమ విధులను బహిష్కరిస్తున్నారు. శనివారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు న్యాయవాదుల సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.నాగభూషణం నాయుడు, ఎం.వి.చక్రపాణి తెలిపారు. న్యాయవాదిని హతమార్చిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణకు రాష్ట్రంలో ప్రత్యేక చట్టం రూపొందించి శాసనసభలో ప్రవేశపెట్టాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పి.రవిగువేరా, ఐఏఎల్ నాయకులు రవికాంత్ ప్రసాద్, పి.దస్తగిరి, రంగనాథ్ డిమాండ్ చేశారు.

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

కర్నూలు(సెంట్రల్) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ 9 ఏళ్లలో చేపట్టిన అభివృద్ధి,అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలంగాణ మహిళా మోర్చా అధికార ప్రతినిధి రోజారమణి తెలిపారు. శనివారం కల్లూరులోని పార్టీ కార్యాలయంలో నంద్యాల జిల్లా మహిళా మోర్చా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పా జ్యోతిరెడ్డి, ఇన్‌చార్జ్ గీత మాధురి పాల్గొన్నారు.

1 నుంచి చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శన

కర్నూలు(టౌన్): వచ్చే నెల 1వ తేదీ నుంచి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయలసీమలో ప్రాజెక్టులను సందర్శించనున్నట్లు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడి వివరాలు వెల్లడించారు.

జీబీ దర్గాను దర్శించుకున్న కేడీసీసీబీ చైర్‌పర్సన్

కర్నూలు(రాజ్‌విహార్): కేడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ ఎస్వీ విజయమనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు కర్నూలులోని జీబీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శనివారం మొహర్రం సందర్భంగా దర్గా నిర్వాహకుల ఆహ్వానం మేరకు ఆమె అక్కడికి చేరుకుని ప్రత్యేక దువా చేశారు. అదేవిధంగా కర్నూలులోని బళ్లారీ చౌరాస్తాలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో 101 టెంకాయల సమర్పణ చేశారు.

పారదర్శకంగా పథకాల అమలు

● గడప గడపకు మన ప్రభుత్వంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్


ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఎంతో పారదర్శకంగా అమలు చేస్తోందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం ఆయన స్థానిక 5వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కుమ్మరిగేరి వీధుల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తున్నామన్నారు.అవినీతికి, అవకతవకలకు అవకాశం లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాత, పార్టీ నాయకులు శేషయాదవ్, అక్బర్ అలీ, మహబూబ్ బాషా, ఖాదర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులను కలిసిన రీజినల్ పాసుపోర్టు అధికారి

కర్నూలు(సెంట్రల్):వైఎస్ఆర్‌సీపీ జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన రీజినల్ కో ఆర్డినేటర్లు వైఎస్ఆర్ జెడ్పీ చైర్మన్ ఆకెపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యేలు చెన్నకేశవరెడ్డి, వై.సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డి, హాఫీజ్‌ఖాన్, శ్రీదేవిలను రీజినల్ పాసుపోర్టు అధికారి దాసరి బాలయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం అతిథి గృహంలో ఆయన వారికి బొకే ఇచ్చి పాసు పోర్టు ఆధారిత సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. మరోవైపు హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే తాను ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల విదేశీ వ్యవహారాల అధికారిగా పనిచేస్తున్నానని చెప్పారు. కా గా, ఆయనది సొంతూరు జిల్లాలోని ఆలూరు పట్టణం. ఈ క్రమంలో కర్నూలు వచ్చిన ఆయన ప్రజాప్రతినిధులను మర్యాద పూర్వకంగా కలిశారు.


ప్రజాప్రతినిధులకు బొకే అందజేస్తున్న దృశ్యం

ఎస్ఎస్ సెవెన్ వండర్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

కర్నూలు (టౌన్) : నగరంలోని ఎగ్జిబిషన్ మైదానంలో శనివారం సాయంత్రం ఎస్ఎస్ సెవెన్ వండర్స్ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్నూలు నగర ప్రజల ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌లో ప్రపంచ వింతలు ఆకట్టుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ సెవెన్ వండర్స్ ఎగ్జిబిషన్ నిర్వాహకులు శ్రీనివాసులు, ముజీబ్, స్థానిక కార్పొరేటర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.


ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

ఉస్మానియా అధ్యాపకుడికి డాక్టరేట్



కర్నూలు సిటీ: ఉస్మానియా డిగ్రీ కాలేజీ అధ్యాపకుడి షేక్ అబ్దుల్ మునీర్‌కు ఫిజిక్స్‌లో రాయలసీమ యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ఈ విషయాన్ని శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఉర్దూ యూనివర్సిటీ ఆచార్యులు హెచ్.అలీమ్ బాషా పర్యవేక్షణలో స్టడీస్ ఆఫ్ లోయర్ అట్మాస్ఫెరిక్ పెరామీటర్స్ ఓవర్ ఏ లో లాటిట్యూడ్ స్టేషన్ అనే అంశంపై పరిశోధన చేశారు. తమ కాలేజీ అధ్యాపకుడికి పీహెచ్‌డీ రావడంతో ఆ కాలేజీ కరస్పాండెంట్ అజ్రా జావెద్, ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్, అధ్యాపకులు అభినందించారు.

రెండు గ్రావెల్ లారీలు పట్టివేత

కర్నూలు (టౌన్) : కర్నూలు–బేతంచర్ల జాతీయ రహదారి సమీపంలోని పూడిచర్ల వద్ద శనివారం మైనింగ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అనుమతి లేకుండా గ్రావెల్ తరలిస్తున్న రెండు లారీలను పట్టుకొని ఒక్కో వాహనానికి రూ. 10 వేల ప్రకారం జరిమానా విధించారు. అలాగే, అక్రమంగా ముజాయిక్ చిప్స్ తరలిస్తున్న వాహనానికి రూ. 39 వేలు జరిమానా విధించినట్లు జిల్లా మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ వెల్లడించారు. పట్టుబడిన వాహనాలను ఓర్వకల్లు పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు.